అభూతకల్పన

ప్రేమ జీవితం

శ్రీ
కొడవటిగంటి కుటుంబరావు

మా స్నేహితుడి కొకడికి ప్రేమపుట్టింది. లేకలేకపుట్టిన ఈ ప్రేమను చూసుకుని వాడు తెగమురిసిపోసాగాడు. స్నేహితులమైన మా అందరికీ తనప్రేమను ప్రదర్శించి, దాని గుణగణాలు తెగపొగడసాగాడు.

ఎంతచెడ్డా స్నేహితులం గనక ఇంత అందమయిన ప్రేమ కలిగినందుకు మేం వాణ్ణి అభినందించి, ప్రేమకు యథోచితంగా ఆశీర్వదించాం.

నిజానికి మాలో కొందరికి ఈప్రేమ అంత అందమయిందిగా కనిపించలేదు. అప్పుడే పుట్టిన ప్రేమ ఏమంత అందంగా ఉంటుంది గనక? దానికి ఏడవటం తప్ప ఏమీచాతకాదు. మాటలా రావు. ఏడవ నప్పుడు కళ్లుమూసుకుపడుకుంటుంది. ప్రపంచజ్ఞానమూ, శూన్యం.

దీనికెన్నిగండాలు గడవాలో, ఎంతపోషణచెయ్యాలో!

ప్రేమపుట్టగానేసరా? దాన్ని పెంచుకు రావటంలో ఎంతోఉంది?

అయితే ఆ వివేకం అనేకమంది తల్లులకుండదు. వాళ్ళు పిల్లల్నికనటమే ఒక మహాత్కార్యమనీ, ఆపని చేసేసిన తరువాత వాళ్ళకేమీ బాధ్యతలేదనీ, బిడ్డ వన్నెచిన్నెలన్నీ తనంతటతానే సంపాయిస్తుందనీ, దానికేమన్నా ప్రమాదం కలిగితే ఆతప్పు భగ వంతుడిదనీ భావించినట్టు ప్రవర్తిస్తారు.

ప్రేమపుట్టిన మా స్నేహితుడిట్లాగే ప్రవర్తించసాగాడు. తనప్రేమచూసుకుని మురవటంలో కొంతకాలం వ్యర్థంచేశాడు. దానికి హరించుకోలేనంత ఆహారం ఇచ్చి దాని ఆరోగ్యం చెడ గొట్టాడు. అది పోరుపెట్టి ఏడుస్తుంటే ఏదో చికిత్సచెయ్యటానికి బదులు, దమ్మిడీ అంతమొహంచేసుకుని దిగులుపడి, అడ్డమైన వాళ్ళ సలహాతీసుకుని అందరి సలహాకూడా ఒక్కసారే ఆచరణలో పెట్టి ప్రేమను మరింత పాడుచేసుకున్నాడు.

వాడిప్రేమ ఒళ్ళుచెయ్యలేదు, నవ్వలేదు, కేరింతలు పెట్ట లేదు, బోర్లపడలేదు, పాకలేదు.

సాటిస్నేహితుడిప్రేమ ఇటువంటి దుస్థితిలో ఉండటంచూసి కొంతమంది స్నేహితులు వాణ్ణి గట్టిగా కోప్పడి, ప్రేమను పెంచే సక్రమవిధానాలు నేర్పారు.

మా స్నేహితుడిప్రేమ కాస్త కోలుకుని, చేతులూకాళ్లూ ఆడించి నలుగుర్నీ చూసినవ్వటమూ, "ఊ" "ఆ," అనటమూనేర్చింది.

మళ్ళీ పారవశ్యం పైగమ్మి మావాడు జ్ఞానం కోల్పోయి నాడు. ప్రేమ పాకాడటం నేర్చుకునే రోజుల్లోనే పరిగెత్తించటానికి ప్రయత్నించాడు. అది తొక్కుమాటలు మాట్లాడుతుంటే దానివెంట తనుకూడా ఆమాటలే మాట్లాడి తనుకూడా ఒక శిశువయిపోయినాడు. కాలం గడిచినకొద్దీ ప్రేమకు అతిప్రేమ చూపించి, జాస్తిగా లాలనచేసి, మకురుతనంనేర్పి నానాభ్రష్టుగా పెంచాడు.

ఎడంగా ఉండి చూసేవాళ్ళకి వాడు తనప్రేమద్వారా ఎక్కువ ప్రేమపుట్టినందుకు వాణ్ణి అభినందించిన వాళ్ళమందరమూ విచారించ వలసిన అవసరం కలిగింది.

కాని వాడికీ వాడిప్రేమకూ మధ్య అడ్డం వెళ్ళటానికి మాకె వరికీ గుండెచాలలేదు. వాడికి పుట్టినప్రేమ వాణ్ణి వొట్టికుంతనుచేసి ఎట్లాపడితే అట్లా ఆడిస్తుంటే దానికెవరు బాధ్యులు?

ఈస్థితిలో, మా స్నేహితుడికి ప్రేమపుట్టినవార్త కాస్తా పెద్దలకు తెలిసింది. ఈసంగతి తెలియగానే పెద్దలకు కోపం వచ్చింది. ఈప్రేమ సక్రమంగా పుట్టినది కాదన్నారు పెద్దలు. దీన్ని తక్షణం వెలివెయ్యాలన్నారు.

పెద్దలు చెప్పింది కాదనటానికి వీల్లేదు. వీలుంటే వాళ్ళు పెద్దలేకారు! వాళ్ళతో వాదించి లాభంలేదు. వాళ్ళకు వాదన ఏమిటో తెలీదు.

అయినా మేం వదిలిపెట్టలేదు.

"ఏదో దారితప్పి, వాడికి, పాపం, లేకలేక ప్రేమపుట్టింది. చూసీచూడనట్టు పోనివ్వండి!" అన్నాం పెద్దలతో.

"అట్లా ప్రేమపుట్టటానికి వీల్లేదు. మా ఎదట ఇటువంటిది జరగటానికి వీల్లేదు!" అన్నారు పెద్దలు.

"తీరా పుట్టిన తరవాత ఏంచేస్తారు? మీలో ఎవరికీ ఎన్నడూ ప్రేమపుట్టలేదా?" అన్నాం.

"పుడితే దాన్ని వెంటనే హతమార్చేశాం! అంతేకాని ఇట్లా చాటునా మాటునా పెంచామా?" అన్నారు పెద్దలు.

అదీ నిజమే మరీ!

"ఇంకొక స్వల్పవిషయంకూడా గమనించండి!" అన్నాం పెద్దలతో" వీడికిపుట్టిన ఈప్రేమ ఎట్లాగో భ్రష్టాకారిదై పోయింది. దాన్ని సరిగా పట్టుకురావటం మావాడికి చాతకాలేదు. ఇటువంటి భ్రష్టాకారి ప్రేమమీద మీవంటి పెద్దలు చెయ్యిచేసుకోవటం యోగ్యమైన పనికాదు."

ఈ మాటలువిని మావాడు మండిపడ్డాడు.

"నాకు పుట్టినప్రేమను అడ్డమైనవాళ్ళు ఇటువంటి మాట లంటే నేనూరుకోను, నేను దాన్ని ఎంతో ఆదర్శప్రాయంగా పెంచాను. నాప్రేమే నాకు పంచప్రాణాలున్నూ. ప్రపంచంలో అదివర కెంతమందికి ప్రేమపుట్టినా నాకు పుట్టినప్రేమతో ఏమూలా సరిపోదు. నాప్రేమనే ఆక్షేపిస్తున్నారుగా?" అన్నాడు మావాడు.

ఆ ముక్కతో పెద్దల ఆగ్రహం మరింత జాస్తి అయింది.

వాళ్ళు మావాడిప్రేమను కాస్తా బలాత్కారంగా లాక్కు పోయి ఎక్కడో వదిలేశారు. అది వికృతరూపంతో నానామూలలా తిరిగి అతిదౌర్భాగ్యమైన బతుకుబతికి చివరకు ఐపులేకుండా పోయింది.

ఇప్పుడు మావాడు తనకెన్నడూ ప్రేమ కలగనట్టే నటిస్తాడు. ఎవరికన్నా ప్రేమపుట్టిందంటే మొహం [illegible]